క్లుప్తంగా

గణతంత్ర వేడుకలకు 'వివేకానంద' విద్యార్థిని


విమలత

నెల్లూరు(టౌన్): దేశ రాజధానిలో గురువారం నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థిని విమలత ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని కరస్పాండెంట్ రాధాకృష్ణ, ప్రిన్సిపల్ ప్రభాకర్, డీన్ శ్రీకర్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి రమణ మంగళవారం అభినందించారు. తమ కళాశాల విద్యార్థులు గతంలో నవసైనిక్‌లో సత్తా చాటారని వివరించారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నెల్లూరు బాలిక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ అండర్ – 14 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు నెల్లూరు బాలిక నిస్సీ అభిరూప ఎంపికైందని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి విజయ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మాట్లాడారు. తాడేపల్లిగూడెంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జట్టుకు ఎంపికై ందని చెప్పారు. సాయి మిలీనియం స్కూల్లో 8వ తరగతి చదువుతున్న నిస్సీ అభిరూపను పలువురు అభినందించారు.

స్కూల్ గేమ్స్ కరాటే ఎంపికలు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ – 19 బాలబాలికల కరాటే జట్లను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం మధ్యాహ్నం ఎంపిక చేయనున్నామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ – 19 కార్యదర్శి వేణుగోపాలరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2004, జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు అర్హులని చెప్పారు.

వేణుగోపాల్‌రెడ్డికి సత్కారం



నెల్లూరు(బృందావనం): పురమందిరంలో సింహపురి సంస్కృతి సమాఖ్య వార్షికోత్సవ వేడుకలను సమాఖ్య వ్యవస్థాపక కార్యదర్శి రాంజీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కావలి మాజీ ఎమ్మెల్యే ఒంటేరు వేణుగోపాల్‌రెడ్డిని సత్కరించారు. సుస్వర ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించిన గానలహరి అలరించింది. ఆర్డీఓ మలోల, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, నరసింహారెడ్డి, హరినారాయణరెడ్డి, జయప్రకాష్, రమణారెడ్డి, రవిప్రకాష్, డాక్టర్ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా పవన్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జాతీయ మానవ హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా నగరానికి చెందిన పవన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులను ఢిల్లీలోని నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్ కమిషన్ విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరి 23 వరకు పదవిలో ఈయన కొనసాగనున్నారు.

పొట్టేపాళెంలో న్యాయ విజ్ఞాన సదస్సు



నెల్లూరు రూరల్: వివాదాలను లోక్ ఆదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ పేర్కొన్నారు. పొట్టేపాళెం ఎస్సీ కాలనీలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సీనియర్ సిటిజన్లతో కుటుంబసభ్యులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. వీఆర్వో శ్రీహరి, సర్పంచ్ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బీవీనగర్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని ఏఈ చిన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీవీనగర్, కల్యాణ్‌నగర్, రాజు కాంప్లెక్స్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్


మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంట్లో అర్హులకు సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అందిస్తున్నామని.. ఒక వేళ ఎవరికైనా అందకపోతే పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సచివాలయ కన్వీనర్లతో ఆత్మీయ సమావేశాన్ని నగరంలోని ఎమ్మీఎస్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. నగర నియోజకవర్గ పరిశీలకుడు యల్లసిరి గోపాల్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను తెలియజేయాలని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తనకు కోపమెక్కువ అని చాలా మంది అంటున్నారని.. అంతకు మించిన ఓర్పు ఉందని తెలిపారు. తననెన్ని ఇబ్బందులు, అవమానాలకు గురిచేసినా భరించానని.. ఏ రోజూ సీఎం దృష్టికి తీసుకెళ్లలేదన్నారు. తన అనుకున్న వారి కోసం పదడుగులు ముందుకేస్తానని.. వెనుకడుగేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి సాయం

• సీఎస్సార్ నిధులు రూ.40 లక్షల అందజేత
• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


మంత్రి కాకాణికి చెక్కును అందజేస్తున్న పరిశ్రమల ప్రతినిధులు

నెల్లూరు(సెంట్రల్): సర్వేపల్లి నియోజకవర్గంలో గిరిజనులకు మంజూరైన జగనన్న ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయం చేసేందుకు పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్సార్ నిధులను ఇవ్వడం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇమామీ కంపెనీ రూ.20 లక్షలు, సంతోషీమాతా కంపెనీ రూ.10 లక్షలు, కిసాన్ క్రాఫ్ట్ కంపెనీ రూ.పది లక్షల సీఎస్సార్ నిధులను చెక్కుల రూపంలో ఆయా పరిశ్రమల ప్రతినిధులు మంత్రికి నెల్లూరులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడా రు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు స్థలమివ్వడంతో పాటు ఇళ్లు కట్టించి ఇస్తున్నారని గుర్తుచేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని పేద గిరిజనులకు ప్రభుత్వం అందజేస్తున్న రూ.1.8 లక్షల నగదుతో పాటు అదనంగా సీఎస్సార్ నిధుల కింద రూ.15 వేల చొప్పున ఇవ్వనున్నామని వెల్లడించారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మొత్తం 2700 గృహాలతో పాటు పొదలకూరులో గిరిజనులకు ఇటీవల మంజూరైన 800 ఇళ్ల నిర్మాణాలకు అదనంగా సాయం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పలు పరిశ్రమల యాజమాన్యాలు ముందుకొచ్చి సీఎస్సార్ నిధులివ్వడం శుభపరిణామమన్నారు. కలెక్టర్ చక్రధర్‌బాబు ఇప్పటికే 700 కుటుంబాలకు నిధులను విడుదల చేశారన్నారు. అందరి సహా య, సహకారాలతో గిరిజనుల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని తెలిపారు. పరిశ్రమల కేంద్ర జీఎం మారుతి ప్రసాద్, డీడీ షఫీ అహ్మద్, హౌసింగ్ పీడీ వెంకటదాస్, తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిదారులకు నోటీసులివ్వండి


మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: ఆస్తి, కుళాయి పన్ను బకాయిదారులకు నోటీసులను జారీ చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ విభాగాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. వాణిజ్య భవనాలను గుర్తించి పన్ను బకాయి ఉన్న వారికి నోటీసులను జారీ చేయాలని సూచించారు. అప్పటికీ స్పందించకపోతే వారి ఆస్తులను జప్తు చేయాలని పేర్కొన్నారు. కుళాయి, డ్రైయిన్ల కనెక్షన్లను కట్ చేయాలన్నారు. మున్సిపల్ దుకాణాల అద్దె చెల్లించని వారిని వెంటనే ఖాళీ చేయించాలని సూచించారు. మున్సిపల్ దుకాణాల వివరాలను పూర్తి స్థాయిలో ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ప్రతి భవనాన్ని పన్ను పరిధిలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులకు సంబంధించిన యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ ఆఫీసర్లు శ్రీనివాసులు, సమద్, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో విమర్శలు తగవు


మాట్లాడుతున్న అబూబకర్

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గా అభివృద్ధి పనులపై విమర్శలు తగవని దర్గా ఈద్గా ఖతీబ్ ఇమామ్ హాజరత్ అబూబకర్ పేర్కొన్నారు. దర్గాలో రూ.15 కోట్లతో జరుగుతున్న వివిధ పనులను దర్గా కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. దర్గా అభివృద్ధి విషయాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ముస్లిం మైనార్టీ నేతలు తెలిపారన్నారు. దీంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దర్గా అభివృద్ధికి రూ.15 కోట్లను ఎమ్మెల్యే విడుదల చేయించారని చెప్పారు. ఎన్నార్సీ చట్టాలకు వ్యతిరేకంగా.. ముస్లింలకు అండగా నిలిచిన ఏకైక వ్యక్తి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అని కొనియాడారు. దర్గా అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు విమర్శలు చేయడం సరి కాదని సూచించారు. నిబద్ధత లేని విమర్శలతో ప్రగతి పనులు నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈద్గా కమిటీ అధ్యక్షుడు షకీల్ అహ్మద్, సభ్యులు అబ్దుల్ రషీద్, ఇస్మాయిల్, జాఫర్ షరీఫ్, రియాజుద్దీన్, గయాజుద్దీన్, అల్లా బక్షు, మహ్మద్‌జువాదుల్లా, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల అదృశ్యంపై మహిళా కమిషన్ ఆరా

నెల్లూరు(క్రైమ్): రాపూరులో తీవ్ర కలకలం రేపిన గురుకుల పాఠశాల విద్యార్థినుల అదృశ్యంపై రాష్ట్ర మహిళా కమిషన్ జిల్లా పోలీసులను మంగళవారం ఆరాతీశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ విజయారావును అడిగి కమిషన్ సభ్యురాలు లక్ష్మి తెలుసుకున్నారు. గంటల వ్యవధిలోనే పోలీస్ అధికారులు విద్యార్థినుల ఆచూకీని కనుగొని వారిని తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించడాన్ని అభినందించారు.

ఎస్పీ అభినందన

రాపూరు గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన ముగ్గురు పదో తరగతి విద్యార్థినుల కేసును గంటల వ్యవధిలోనే ఛేదించి వారిని తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ విజయారావు అభినందించారు. సంక్రాంతి సెలవుల అనంతరం ముగ్గురు విద్యార్థినులు పాఠశాలకు వచ్చారని చెప్పారు. ఇంటిపై బెంగ.. మరోవైపు ఇంటికెళ్తే మందలిస్తారనే ఆలోచనతో హాస్టల్ నుంచి సోమవారం వెళ్లిపోయారని తెలిపారు. ఈ విషయమై హాస్టల్ యాజమాన్యం విద్యార్థినుల తల్లిదండ్రులు, రాపూరు పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. రాపూరు సీఐ కోటేశ్వరరావు పర్యవేక్షణలో రాపూరు, సైదాపురం, కండలేరు ఎస్సైలు క్రాంతికుమార్, శివశంకర్, అనూషతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సాంకేతికత ఆధారంగా విద్యార్థినులు వెంకటగిరిలో ఉన్నారని తెలుసుకొని ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని చెప్పారు. వెంకటగిరి టీచర్స్‌కాలనీలో ఉన్నారని గుర్తించి వారిని సురక్షితంగా తీసుకొచ్చి కౌన్సెలింగ్ అనంతరం తల్లిదండ్రులకు అప్పగించామని వివరించారు. గంటల వ్యవధిలోనే విద్యార్థినులను క్షేమంగా తీసుకొచ్చిన సిబ్బందిని అభినందించి రివార్డులను ప్రకటించారు.

రామకృష్ణారెడ్డికి ఘన నివాళి



నెల్లూరు(బారకాసు): బీజేపీ నేత రామకృష్ణారెడ్డి వర్ధంతిని శెట్టిగుంటరోడ్డులో పార్టీ నేత ఆదినారాయణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు మిడతల రమేష్, ఈశ్వరయ్య, సుబ్రహ్మణ్యం, సృజన, జయచంద్ర, వెంకటేశ్వర్లు, శివశంకర్, శ్రీనివాసులు, సుభానీ, తదితరులు పాల్గొన్నారు.

• సింహపురి హాస్పిటల్ సమీపంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆటో కార్మికుల చేతుల మీదుగా బీజేఎంఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు మధు, ఈశ్వరయ్య, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, కేవీ రావు, హరి, చైతన్య, సుబ్బారావు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పాటలు, నృత్య పోటీలు నేడు

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో చైతన్య జ్యోతి కళాసేవా సమితి వార్షికోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించనున్నామని సంస్థ అధ్యక్షుడు నాగరాజు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిరంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాటలు, నృత్య పోటీలు, సంగీత విభావరిని నిర్వహించనున్నామని చెప్పారు. అమానుల్లాఖాన్, రాధాకృష్ణ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకుడు సుధీర్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు.

భ్రూణ హత్యలను నివారిద్దాం



మాట్లాడుతున్న శ్రీనివాసులునాయక్

నెల్లూరు(అర్బన్): భ్రూణ హత్యలను నివారించాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ పేర్కొన్నారు. భ్రూణ హత్యల నివారణ చట్టం.. మహిళా చైతన్యం అనే అంశాలపై సదస్సును ఆర్టీఏ కార్యాలయ సమీపంలోని మల్లాల రామయ్య కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో మంగళవారం నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసులునాయక్ మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేపీసీ కళాశాలలో వైద్య శిబిరం

నెల్లూరు (టౌన్): స్టోన్‌హౌస్‌పేటలోని కేపీసీ జూనియర్ కళాశాలలో వైద్య శిబిరాన్ని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ గురువయ్య, సమగ్రశిక్ష ఈఈ శ్రావణ్‌కుమార్, మోటివేటర్ భాస్కర్‌రావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు మునిరాజా, చెంచయ్య, అధ్యాపకులు నారాయణ, బాలపున్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవ సంబరాలు నేడు

నెల్లూరు(అర్బన్): నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవ సంబరాలను బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నామని కలెక్టర్ చక్రధర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఓటర్లకు ఫొటో గుర్తింపు కార్డులను అందజేయనున్నామని చెప్పారు. నూతన ఓటర్లను నమోదు చేయనున్నామన్నారు. ఎన్నికల సంఘం ఈ ఏడాది ప్రకటించిన నథింగ్ లైక్ ఓటింగ్.. ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రశంసపత్రాలను అందజేయనున్నామని చెప్పారు.

దాడి ఘటనలో నిందితులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఆస్తి తమదని.. ఖాళీ చేయకపోతే చంపుతామని దౌర్జన్యం చేయడంతో పాటు సిబ్బందిపై దాడి చేసిన ఘటనలో నిందితులపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటరమణ విలాస్, పద్మావతి తాజాతిండి హోటల్ విషయంలో రమేష్‌రెడ్డినగర్‌కు చెందిన వెంకటసుబ్బారావుకు నగరానికి చెందిన పెంచలయ్యకు విభేదాలున్నాయి. వివాదం కోర్టులో ఉంది. ఈ నేపథ్యంలో పెంచలయ్య బావమరిది నాగేశ్వరరావు తన అనుచరులతో కలిసి హోటల్లోకి సోమవారం రాత్రి చొరబడి వంటగదిలోని సామగ్రిని బయట పడేశారు. అడ్డుకోబోయిన హోటల్ సిబ్బందిపై దాడి చేశారు. ఆస్తి తమదని.. ఖాళీ చేయకపోతే చంపుతామని బెదిరించారు. బాధితుడు వెంకటసుబ్బారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

• ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపట్టి.. మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పించడమే తన లక్ష్యమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 31వ డివిజన్లోని టైలర్స్ కాలనీలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనను మేయర్ స్రవంతి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి మంగళవారం చేపట్టిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ నాలుగేళ్ల కాలంలో డివిజన్లో రూ.ఎనిమిది కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టామని వివరించారు. మరో రూ.15 కోట్లు మంజూరైతే అభివృద్ధి పనులను పూర్తిస్థాయిలో చేపట్టొచ్చని తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని పేర్కొన్నారు. కార్పొరేటర్ మంజుల, ఏఎంసీ చైర్మన్ హరిబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


బుజబుజనెల్లూరు జెడ్పీ హైస్కూల్లో..


మోడల్ స్కూల్లో..

నెల్లూరు రూరల్: బాల్య వివాహాలతో అనర్థాలు సంభవిస్తాయని, దీనిపై అవగాహన అవసరమని బుజబుజనెల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ స్వరూప పేర్కొన్నారు. బుజబుజనెల్లూరు జెడ్పీ హైస్కూల్లో జాతీయ బాలిక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయులు జకీరాభానుమ్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బారకాసు): నగరంలోని మోడల్ హైస్కూల్లో బాలికా దినోత్సవాన్ని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చట్టాలపై విద్యార్థులకు న్యాయవాది సుప్రియ అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు, సువర్ణ, ప్రియ, బీజేవైఎం నేతలు శివ, కార్తీక్, కృష్ణ, ఖాజామస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

• నగరంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో జాతీయ బాలిక దినోత్సవాన్ని బీజేపీ నేత కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ మహిళా మోర్చా నేత రాజేశ్వరమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్ యాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్, నేతలు శివ, తేజ, ప్రిన్సిపల్ విఠల్, విజయదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): శాస్త్రీయ నృత్య పోటీల్లో ప్రతిభ చూపిన బాలికలను కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్, ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. సుబేదారుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో సాయిశ్రీ, మనస్విని, అశ్విని, జోషిత, మహిత, పునర్వి, తదితరులను అభినందించారు. సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి సేవలో విశ్వవాసవీ మాత పీఠాధిపతి



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని బెంగళూరులోని విశ్వ వాసవీ మాత పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. దేవస్థాన పాలకమండలి గౌరవాధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ దంపతులు, తదితరులు ఆయన్ను ఆహ్వానించారు. అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

భారీ వాహనాల ప్రవేశంపై సమీక్ష సమావేశం



నెల్లూరు(క్రైమ్): కృష్ణపట్నం పోర్టు.. ముత్తుకూరు వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు జాతీయ రహదారిపైకి ఏ మార్గం మీదుగా చేరుకోవాలనే అంశంపై సమీక్ష సమావేశాన్ని నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. పలు శాఖల అధికారులు, సీపీఎం నేతలు హాజరయ్యారు. ప్రత్యామ్నాయ రహదారుల్లో రాకపోకల విషయమై మున్సిపల్, జాతీయ రహదారుల శాఖ, ఆర్టీఏ, ఆర్ అండ్ బీ, తదితర శాఖల అధికారులతో చర్చించారు. నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని రహదారి మరమ్మతులు పూర్తయ్యేంత వరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉదయం 8 గంటల్లోపు.. మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు వరకు, రాత్రి తొమ్మిది గంటల తర్వాత చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు మీదుగా వెళ్లేలా నిర్ణయించారు. రహదారి మరమ్మతులు పూర్తయిన అనంతరం గతంలో మాదిరిగా జాతీయ రహదారిపైకి వెళ్తాయని పేర్కొన్నారు. నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ, నాగేశ్వరరావు, సతీష్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.